
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం, 28 మార్చి 2024







పక్కా ప్లాన్...

లోక్‌సభ ఎన్నికల ప్రశాంత నిర్వహణకు పోలీసుల పకడ్బందీ చర్యలు

గత డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టిన అధికారులు.. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలకూ అదేతరహాలో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఎక్కడైనా లోటుపాట్లు ఉన్నాయా...? అనే అంశాలను సమీక్షించుకుని ముందడుగు వేస్తున్నారు. ఎన్నికలకు సంబంధించి ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉన్న ఏ ఒక్క కోణాన్ని ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల ఉన్నతాధికారులు వదలడంలేదు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన చర్యల్లో భాగంగా నేరస్థుల చిట్టాలను వెలికితీయడం, లైసెన్సు కలిగిన ఆయుధాలు వెనక్కి తీసుకోవడం, జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

- ఉమ్మడి జిల్లాలో సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలు 216
- 481 మంది రౌడీలు... 1,279 మంది అనుమానితులు...
- లైసెన్సుడ్ ఆయుధాలు వెనక్కి..
- సరిహద్దుల్లో నిరంతర నిఘా ఏర్పాటు
- శాంతిభద్రతల పరిరక్షణలో తలమునకలు

ఖమ్మం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో అల్లర్లు, కొట్లాటలు జరగకుండా ఉండేందుకు.. ఉన్నతాధికారులు ముందుగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఖమ్మం జిల్లాలో 83 ప్రాంతాల్లో 201 కేంద్రాలను, భద్రాద్రి జిల్లాలో 12 ప్రాంతాల్లో 15 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. వీటితోపాటు అసలు అల్లర్లు జరగడానికి, ఆ సమయంలో గొడవలు సృష్టించేవారు ఎంత మంది ఉన్నారు వంటి వివరాలను కూడా అధికారులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వారిలో భాగంగా నేరచరిత్ర కలిగిన వారి వివరాలను సేకరించి బైండోవర్ చేయనున్నారు. అలా ఖమ్మం జిల్లాలో 245 మంది రౌడీషీటర్లు ఉండగా.. వారిలో ఖమ్మం డివిజన్ పరిధిలో 74 మంది, ఖమ్మంరూరల్ పరిధిలో 70, వైరా పరిధిలో 71, కల్లూరు డివిజన్ పరిధిలో 30మంది ఉన్నట్టు గుర్తించారు. భద్రాద్రి జిల్లాలో 236మంది ఉన్నట్టు గుర్తించారు. వారిలో మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలో ఉన్న పినపాక నియోజకవర్గంలో 31 మంది, ఇల్లెందు నియోజకవర్గంలో 28మంది, భద్రాచలం నియోజకవర్గంలో 34 మంది ఉండగా, ఖమ్మం పార్లమెంటు పరిధిలో వైరా నియోజకవర్గం పరిధిలో 7గురు, కొత్తగూడెం నియోజకవర్గంలో 97మంది, అశ్వారావుపేట నియోజకవర్గంలో 39మంది రౌడీ షీటర్లు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వారితోపాటుగా అనుమానితుల వివరాలను సైతం అధికారులు సేకరించారు. అందులో ఖమ్మంలో 650, కొత్తగూడెంలో 629మంది ఉన్నట్టుగా లెక్క తేల్చారు. కాగా ఆయా వ్యక్తులను ఎన్నికల నేపథ్యంలో బైండోవర్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

చెక్‌పోస్టుల ఏర్పాటు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంతరాష్ట్ర చెక్‌పోస్టులతో పాటు, జిల్లా సరిహద్దుల్లోనూ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఖమ్మం జిల్లా ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ఉండగా.. 12 చెక్‌పోస్టులు ఏర్పాటు చేయగా ఆయా చెక్‌పోస్టులు ఖమ్మంరూరల్ పరిధిలో నేలకొండపల్లి మండలం అప్పలనర్సింహాపురం, ముదిగొండ మండలం వల్లభి, బోనకల్ మండలంలో బోనకల్లు-వత్సవాయి బ్రిడ్జి వద్ద, ఎర్రుపాలెం మండలంలో రాజుపాలెం, ఎర్రుపాలెం సెంటర్‌లో, మధిర పట్టణంలో ఆత్కూరు క్రాస్‌రోడ్డు, నందిగామ రోడ్డులోని రాయపట్నం బ్రిడ్జి, వైరా మండలంలోని గన్నవరం- నెమలి, దాచాపురం టీ జంక్షన్, సత్తుపల్లి మండలం గంగారం రింగ్ సెంటర్, కల్లూరు మండలం పేరువంచ, వీఎం బంజర వద్ద ముత్తగూడెం, వేంసూరు మండలం వెంకటాపురం వద్ద ఉన్నాయి.

భద్రాద్రి జిల్లా ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉండగా అక్కడ 11 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. వాటిలో పినపాక నియోజకవర్గంలో బూర్గంపాడు సెంటర్ వద్ద, అశ్వారావుపేట నియోజకవర్గంలో అల్లిపల్లి, మేడిపల్లి కొత్తూరు, అశ్వారావుపేటలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో, దమ్మపేట మండలం జలవాగు వద్ద, భద్రాచలం నియోజకవర్గంలో భద్రాచలం పట్టణ పరిధిలోని కూనవరం రోడ్డులో, ఐటీడీఏ రోడ్డులోని క్రాంతి ఐటీఐ కళాశాల వద్ద, రాజుపేట కాలనీలోని చర్ల రోడ్డులో, తిప్పాపురం గ్రామం వద్ద, తురుబాక బ్రిడ్జి వద్ద, పైడిగూడెం వద్ద సీఆర్‌పీఎఫ్ క్యాంపు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి షిఫ్టుల వారీగా విధులు నిర్వర్తించేలా నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు.

జిల్లా	రౌడీషీటర్లు	అనుమానితులు	లైసెన్సు ఆయుధాలు	చెక్‌పోస్టులు	సమస్యాత్మక కేంద్రాలు
ఖమ్మం	245	650	129	12	201
కొత్తగూడెం	236	629	46	11	15

లైసెన్సుడ్ ఆయుధాలు వెనక్కి...

ఆయుధ లైసెన్సు ఉన్నవారు ఎన్నికలు, ముఖ్యమైన పండుగలు, ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో పోలీస్ స్టేషన్లో అప్పగించాలి. 48 గంటలకు పైగా వేరే ఎక్కడైనా ఉంటున్న సమయంలో అక్కడ పోలీస్ స్టేషన్‌కు తన వద్ద ఆయుధం ఉన్నట్టుగా సమాచారం అందించాలి. ఆత్మరక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 30 గజాల దూరంలోని శత్రువును కాల్చడానికే వ్యక్తిగత అనుమతి మంజూరు చేస్తారు. దానికి సరిపడా రివాల్వర్, పిస్టల్, 12-బోర్ గన్‌లకు మాత్రమే అనుమతిస్తారు. అంతేకాదు లైసెన్సు పొందిన వ్యక్తులు ఆయుధాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రదర్శించకూడదు.

కాగా ఎన్నికల తరుణంలో మాత్రం ఖచ్చితంగా ఆయా లైసెన్సు కలిగిన ఆయుధాలను డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లాలో లైసెన్సులు కలిగి ఉన్న వ్యక్తుల వద్ద ఉన్న రివాల్వర్లను రిటర్న్ చేయించి సంబంధిత పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయించే పనిలో సంబంధిత విభాగం అధికారులు నిమగ్నమయ్యారు. జిల్లాలో తుపాకీలు ఎన్ని ఉన్నాయి? ఏయే తుపాకీలు ఉన్నాయి? వాటిల్లో సెక్యూరిటీ ఏజెన్సీలకు సంబంధించినవి ఎన్ని? ఆత్మరక్షణార్థం ఇచ్చినవి ఎన్ని? వంటి వివరాలు సేకరించి వాటికి సంబంధించిన వ్యక్తుల నుంచి ఆయా ఆయుధాలను వెనక్కి తెప్పించుకుంటున్నారు. అలా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం ఆయుధాలు 175 ఉన్నాయి. అందులో ఖమ్మం జిల్లాలో 129 ఉండగా బ్యాంకు సెక్యూరిటీలకు సంబంధించి 43 ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో మొత్తం 46 ఉండగా.. అందులో బ్యాంకు సెక్యూరిటీలకు సంబంధించి 14 ఉన్నట్టు సమాచారం.



7

ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని మల్సూర్‌తండా పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ గౌతమ్

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు

- ఏప్రిల్ 15 లోగా పూర్తి చేయాలి
- ఓటర్లకు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తవద్దు
- ఏప్రిల్ 1, 2 తేదీల్లో పోలింగ్ సిబ్బందికి శిక్షణ తరగతులు
- అధికారులతో కలెక్టర్ వీపీ గౌతమ్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 27: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను ఏప్రిల్ 15లోగా పూర్తి చేయాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల్లో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలన్నారు. మన ఊరు-మన బడి, ఎస్డీఎఫ్ కింద కవర్ గాని380 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద సౌకర్యాల కల్పనకు మంజూరు ఇచ్చామన్నారు. ఇందులో 74ఉన్నత, 306 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయన్నారు. వీటిలో 380 పాఠశాలల్లో 542 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు ఆయన అన్నారు.

78 పాఠశాలల్లో కాంపౌండ్ వాల్ నిర్మాణాలు మంజూరు చేయగా, 19చోట్ల పనులు పూర్తి కాగా, 29చోట్ల ప్రగతిలో ఉన్నాయన్నారు. ఎల్ఈడీ లైట్లు, గదికి కనీసం రెండు ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు. టాయిలెట్లలో వాటర్ సదుపాయం కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రం బయట వీధి లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు వేర్వేరుగా వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెయింటింగ్ అవసరమున్నచోట పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్ 15లోగానే పనులు పూర్తి అయ్యేలా కార్యాచరణ చేయాలన్నారు. విద్యుదీకరణకు సంబంధించి, వేలాడే వైర్లకు పైపింగ్ చేపట్టాలన్నారు. పాఠశాలల్లో శాశ్వత ప్రాతిపదికన వసతులను ఏర్పాటు చేయాలన్నారు. వేసవి సెలవుల అనంతరం పిల్లలు పాఠశాలలకు వచ్చినప్పుడు, పాఠశాలల రూపురేఖలు చూసి సంతోషపడతారని, అడ్మిషన్లు పెరుగుతాయన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎన్నికల విధుల ఉత్తర్వులు జారీచేసినట్లు, గురువారంలోగా సంబంధిత సిబ్బందికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బందికి ఏప్రిల్ 1, 2 తేదీల్లో ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాల, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిక్షణా కేంద్రం వద్దే ఎన్నికల విధుల సిబ్బందికి ఫారం-12 పోస్టల్ బ్యాలెట్లు, ఫారం-12ఏ అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్ యువరాజ్, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, ఆర్అండ్‌బీ, పీఆర్, విద్యాశాఖ, గిరిజన సంక్షేమశాఖ, మునిసిపల్‌శాఖ ఇంజనీర్లు, ఎంఈవోలు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి తరలింపునకు రూట్ మ్యాప్
భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ 7



ఉపాధ్యాయుడిని పాఠశాలలో నిర్బంధించిన దృశ్యం

మందు కొట్టి బడికి వచ్చాడు..

- చర్ల మండలం జీపీపల్లిలో ఉపాధ్యాయుడి నిర్వాకం
- పాఠశాలలో నిర్బంధించిన గ్రామస్థులు
- సస్పెండ్ చేసిన డీఈవో

చర్ల, మార్చి 27: అతడు భావిపౌరులను తీర్చిదిద్దే గురుతర బాధ్యతలు మోస్తున్న ఉపాధ్యాయుడు. విద్యార్థులకు ఆదర్శంగా నిలవాల్సిన వ్యక్తి. కానీ అతడే పద్ధతి తప్పి మద్యం తాగి పాఠశాలకు వచ్చాడు. భద్రాద్రి జిల్లా చర్ల మండలంలోని జీపీపల్లిలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. చర్ల మండలం జీపీపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు, 73 మంది విద్యార్థులు ఉన్నారు. బుధవారం ఒక ఉపాధ్యాయుడు సెలవు పెట్టగా, మరో ఉపాధ్యాయుడు బి.కిషన్ మద్యం తాగి విధులకు హాజరయ్యాడు. మద్యం మత్తులో విద్యార్థులను కొడుతుండడంతో కొంతమంది విద్యార్థులు ఈ విషయాన్ని తమ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో గ్రామస్థులు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయుడితో మాట్లాడేందుకు ప్రయత్నించగా అతడు మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించి పాఠశాల లోపల పెట్టి తాళాలు వేశారు. అనంతరం విద్యాశాఖ అధికారులకు సమాచారం అందించారు. వివరాలు సేకరించిన అధికారులు జిల్లా విద్యాశాఖ అధికారులకు నివేదిక పంపించారు. మద్యం తాగి విధులకు వచ్చిన సదరు ఉపాధ్యాయుడిని బుధవారం సాయంత్రం డీఈవో సస్పెండ్ చేసినట్లు చర్ల ఎంఈవో జుంకీలాల్ తెలిపారు.

భద్రాద్రి అభివృద్ధిపై అధ్యయనం

- క్షేత్రస్థాయిలో ఆర్కిటెక్ట్‌ల పరిశీలన
- రేపు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్ల రాక
- పూర్తిస్థాయి ప్రణాళికకు నెలలో తుదిరూపు

భద్రాచలం మార్చి 27: రాష్ట్ర ప్రభుత్వం భద్రాచలం రామాలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో బుధవారం ఆర్కిటెక్ట్‌ల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి అధ్యయనం చేసింది. ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తితో పాటు మరొకరు భద్రాద్రి దేవస్థానం అధికారులను ఈ విషయమై తొలుత కలిసి ప్రాథమికంగా చర్చించారు. అనంతరం రామాలయ పరిసరాలు, మాడా వీధులు తదితర ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై భద్రాద్రి దేవస్థానం, పర్యాటక శాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. శతాబ్దాల కాలంగా ఉన్న ప్రాచీన కట్టడాలను సంరక్షిస్తూనే చేపట్టాల్సిన అభివృద్ధిపై క్షేత్రస్థాయిలో పర్యటించి అధ్యయనం చేశారు. ఇది కేవలం ప్రాథమిక పరిశీలన మాత్రమేనని వారు స్పష్టం చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 11న భద్రాచలం పర్యటనకు వచ్చిన క్రమంలో రామాలయ అభివృద్ధిపై మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి భద్రాద్రి దేవస్థానం, దేవాదాయ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ క్రమంలో ఆలయ అభివృద్ధి చేపట్టాలంటే స్థలసేకరణ ఎంతో కీలకం కావడంతో ఆలయ పరిసరాల్లో ఎంత మేరకు ఇళ్లు తొలగించాల్సి ఉంటుందనేది పరిశీలన చేయాలని ఆదేశించారు. దానిపై పూర్తిస్థాయిలో స్పష్టత వస్తే కావాల్సిన నిధులు తప్పక కేటాయిస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో ఇప్పటికే భద్రాద్రి దేవస్థానం, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సుమారు రెండు ఎకరాల్లో 50 ఇళ్ల మేరకు తొలగించాలని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆర్కిటెక్ట్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాగా ఇందుకు సంబంధించి తుది రూపు నెల రోజుల్లో వచ్చే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.



రామాలయం తూర్పు మెట్ల వైపు పరిశీలిస్తున్న ఆర్కిటెక్ట్, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు

ఇదిలా ఉండగా భద్రాద్రి రామాలయ అభివృద్ధి అంశంతో పాటు ఏప్రిల్ 17, 18 తేదీల్లో నిర్వహించే శ్రీరామనవమి, శ్రీరామ మహాపట్టాభిషేకంలకు చేపట్టే ఏర్పాట్లు పరిశీలించేందుకు శుక్రవారం దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, దేవదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు రానున్నట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సమయంలో వారు భద్రాది ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలతోపాటు శ్రీరామనవమి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు వసతులపై స్థానిక అధికారులకు దిశా నిర్దేశం చేయనున్నట్లు తెలిసింది.

భద్రాద్రి రామయ్యకు కాసుల పంట

- 26రోజుల్లో హుండీ ఆదాయం రూ.74.79 లక్షలు
- విదేశీ కరెన్సీ సమర్పించిన భక్తులు

భద్రాచలం మార్చి 27: ఈ నెల 1 నుంచి 26 వరకు భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానానికి హుండీ ద్వారా రూ.74 లక్షల 79 వేల ఆదాయం సమకూరింది. రామాలయ ప్రాంగణంలోని చిత్రకూటమండపంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. దేవాలయంలోని హుండీలద్వారా మొత్తం రూ.71,22,878 రాగా, అన్నదానం సత్రంలో హుండీ ద్వారా రూ.1,61,100, గోశాల హుండీ ద్వారా రూ.1,95,363 ఆదాయం సమకూరింది. మొత్తం రూ.74,79,341ఆదాయం సమకూరింది. అలాగే యూఎస్ డాలర్లు 270, కెనడా డాలర్లు 50, మలేషియా రింజిట్స్ 20, వియత్నాం డోంగ్స్ 2000 లభించాయి. ఈ మొత్తం ఆదాయం 26రోజులకు సమకూరినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. దేవస్థానం హుండీలను చివరిసారి ఫిబ్రవరి 29న లెక్కించారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి పర్యవేక్షించారు. ఏఈఓ భవాని రామకృష్ణారావు, పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, నిరంజన్‌కుమార్, లింగాల సాయిబాబా, దేవస్థానం వైదిక, పరిపాలన సిబ్బంది, బ్యాంక్ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

- ఓటేయనున్న 940 మంది న్యాయవాదులు

ఖమ్మం లీగల్, మార్చి 27: ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు గురువారం నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో జరగనున్నాయి. పోలింగ్ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు జరుగుతుందని, ఓటు హక్కు వినియోగించుకునే సభ్యులు బార్ అసోసియేషన్ జారీ చేసిన ఐడీ కార్డును తీసుకురావాలని ఎన్నికల అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రంలోనికి సెల్‌ఫోన్లు అనుమతించబడవని తెలిపారు. అధ్యక్ష పదవికి కన్నెబోయిన నాగేశ్వరరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, చిలుకూరి స్వర్ణకుమారి పోటీ పడుతుండగా, ప్రధాన కార్యదర్శి పదవికి కొండపల్లి శ్రీనివాస్‌చౌదరి, చింతనిప్పు వెంకటేశ్వరరావు పోటీ పడుతున్నారు. గ్రంథాలయ కార్యదర్శి పదవికి కన్నెగంటి గోపి, దేవరకొండ కళ్యాణి బరిలో ఉన్నారు. మొత్తం 940మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని ఎన్నికల అధికారులు మారగాని శ్రీనివాసరావు, కూరపాటి శేఖర్‌రాజు, రాయల పావెల్లు తెలిపారు. కాగా, ఉపాధ్యక్షుడిగా కె.ఉపేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా కండే వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఎజ్జగాని శ్రీనివాసరావు, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శిగా అలవాల యుగంధర్‌రావు, మహిళా ప్రతినిధిగా తన్నీరు లలిత ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విదితమే.

అయోధ్య నుంచి భద్రాద్రికి ఆధ్యాత్మిక కారిడార్

- బీజేపీ విజయంతోనే ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి
- నరేంద్రమోదీ నాయకత్వంలో సైనికుడిగా పనిచేస్తా
- ఖమ్మం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు



మీడియాతో మాట్లాడుతున్న వినోద్‌రావు


6

నామా రికార్డు

- లోక్‌సభలో అత్యధిక రోజులు హాజరైన ఎంపీగా గుర్తింపు
- మొత్తం 202 ప్రశ్నల ప్రస్తావన



అరుదైన ఆపరేషన్

- చిన్నారి జీర్ణకోశం నుంచి వెంట్రుకల ముద్ద తొలగింపు
- ట్రైకోఫేజియా వ్యాధిగా గుర్తింపు 6



త్రీ స్టాప్ జర్నీ

- ఖమ్మం-భద్రాచలం మధ్య ప్రత్యేక ఆర్టీసీ డీలక్స్ బస్సులు
- నేటి నుంచి ప్రారంభం 7

ప్రైవేటు ఆస్పత్రులపై కొరడా

- అనుమతులు లేని ఆస్పత్రుల సీజ్
- స్కానింగ్, అబార్షన్లు చేస్తే కఠిన చర్యలు: డీఎంహెచ్‌వో



వైరా రోడ్డులోని ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 27: ఖమ్మం నగరంలో అక్రమంగా అబార్షన్లు చేస్తున్న ఆస్పత్రిని సీజ్‌చేశారు. అనుమతులు లేని ఆస్పత్రులపై కూడా దాడులు నిర్వహించారు. ఖమ్మం నగరంలోని వైరారోడ్డుకు సమీపంలో ఓ ఆస్పత్రిలో ఇటీవలె టాస్క్‌ఫోర్స్ పోలీసులు డెకాయ్ ఆపరేషన్ చేసి అక్రమంగా అబార్షన్లు చేస్తుండగా పట్టుకుని ఆ ఆస్పత్రిపై కేసునమోదు చేశారు. ఈ మేరకు బుధవారం డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు ఆస్పత్రికి సంబంధించిన అనుమతులను పరిశీలించారు. అక్కడ స్కానింగ్ మిషన్లు, సిబ్బంది వివరాలను పరిశీలించారు. దస్త్రాలను పరిశీలించిన అనంతరం ఆస్పత్రిపై వచ్చిన ఆరోపణలపై సీజ్ చేశారు. ఆ తర్వాత అదే కాంప్లెక్స్‌లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాజిటివ్ హోమియోపతి, తులసి డెంటల్ ఆస్పత్రిని కూడా సీజ్ చేసినట్లు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. లింగనిర్ధారణ పరీక్షలు, కారణం లేకుండా అబార్షన్లు చేసే ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. స్కానింగ్ కేంద్రాలు, డయాగ్నస్టిక్ కేంద్రాల్లో విధిగా నిబంధనలను పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు. ఈ దాడుల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వో సైదులు, కాశీనాథ్, సీనియర్ అసిస్టెంట్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభలో అత్యధిక హాజరు

ఖమ్మం ఎంపీ నామాదే

▸ 273 రోజులకు 241 రోజులు సమావేశాలకు హాజరు



ఖమ్మం, మార్చి 27(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 17వ లోక్‌సభలో తెలంగాణ రాష్ట్రం నుంచి బీఆర్‌ఎస్ లోక్‌సభపక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు అత్యధిక రోజులు హాజరు నమోదు చేసుకున్నారు. మొత్తం 273రోజులకు గాను 241రోజులు (88.3శాతం) ఆయన లోక్‌సభ సమావేశాలకు హాజరయ్యారు. ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ వివరాలు తెలిపారు. 17వ లోక్‌సభలో రాష్ట్రం నుంచి అత్యధిక హాజరు నామ నాగేశ్వరరావుది కావడంతో పాటు వివిధ సమస్యలపై ఆయన లోక్‌సభలో 202 ప్రశ్నలు అడిగారని నామ క్యాంపు కార్యాలయం తెలిపింది. ఖమ్మం జిల్లా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ఎంపీగా నామ నాగేశ్వరరావు ప్రజా సమస్యలపై స్పందించారని, రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధులసమస్యల పరిష్కారం కోసం లోక్‌సభలో అనేక ప్రశ్నలు అడగడంతో పాటు కేంద్రం చేసిన బిల్లులకు సంబంధించి పార్లమెంట్‌లో జరిగిన చర్చల్లో పాల్గొన్నారని ఈ ప్రకటలో తెలిపారు.

టీబీజీకేఎస్ బాటలో టీఆర్‌వీకేఎస్ ?

▸ బీఆర్‌ఎస్‌తో అనుబంధాన్ని తెంచుకునే దిశగా అడుగులు

▸ ఇండిపెండెంట్ కార్మిక సంఘంగా మార్చేందుకు ముమ్మర యత్నాలు



పాల్వంచ, మార్చి 27: ప్రతిపక్ష బీఆర్‌ఎస్ అనుబంధ బొగ్గుగని కార్మికసంఘ టీబీజీకేఎస్ బాటలోనే ఆ పార్టీ కార్మిక సంఘం టీఆర్‌వీకేఎస్ కూడా నడుస్తున్నట్లు తెలుస్తోంది. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తరువాత జరిగిన పరిణామాల నేపథ్యంలో సింగరేణి సంస్థలో ఆ పార్టీకి అనుబంధంగా ఉన్న కార్మిక సంఘం టీబీజీకే ఎస్ బీఆర్‌ఎస్‌తో అనుబంధాన్ని తెంపుకుంటున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.. ఇటీవలే ముగిసిన సింగరేణి ఎన్నికల్లో పోటీ చేయకూడదని ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్న కల్వకుంట్ల కవితపై ఆనాటి నుంచి తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం నేతలు, యూనియన్ సభ్యులు ఆగ్రహంగా ఉన్నారు. దానికి తోడు రాజకీయాలు యూనియన్ల లో ప్రవేశించడం వల్ల యూనియన్ల ప్రభావం తగ్గిపోతుందని యూనియన్ భావిస్తు న్న తరుణంలో లిక్కర్ స్కాంలో కవిత అరెస్టు కావడంతో ఆ ప్రభావం తమ సంఘంపై పడుతుందని భావించి బీఆర్‌ఎస్‌తో టీబీజీకేఎస్ అనుబంధానికి స్వస్తి చెప్పాలని 23న నిర్ణయించుకుంది. ఈ నిర్ణయం యావత్ తెలంగాణ బొగ్గుగని కార్మికులను ఆలోచనలో పడేసింది. ఆ షాక్ నుంచి బీఆర్‌ఎస్ కోలుకోకముందే మరో సంచలనం జరిగేలా ఉంది. గత ప్రభుత్వ హయాంలో జెన్కో, ట్రాన్స్‌కో, ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్‌లలో ఏకచత్రాధిపత్యం వహించిన తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మికసంఘం (టీఆర్‌వీకేఎస్)కూడా టీబీజీకేఎస్ అడుగుజాడల్లో నడిచేందుకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. టీఆర్‌వీకేఎస్ గౌరవాధ్యక్షురాలుగా ఉన్న కల్వకుంట్ల కవిత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏరోజూ ప్రయత్నించలేదని, రాష్ట్రస్థాయి నాయకులకు సైతం ప్రాధాన్యత ఇవ్వలేదని, వారి ఆలోచనలను గౌరవించలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే ఏప్రిల్ రెండో వారంలో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అన్ని స్టేషన్లలోని యూనియన్ సభ్యులు సమావేశమయ్యే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. యూనియన్‌కు గౌరవాధ్యక్షురాలిగా ఉన్న కల్వకుంట్ల కవితను ఆ పదవి నుంచి తొలగించి, బీఆర్‌ఎస్ అనుబంధ కార్మిక సంఘంగా ఉన్న టీఆర్‌వీకేఎస్‌ను స్వతంత్రంగా నిలపాలని కమిటీ సభ్యులు తీర్మానం చేస్తారని పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6, 7 దశల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.

వైరాలో అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ



విచారణ చేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ అధికారి అశోక్‌కుమార్

వైరా, మార్చి 27: వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నిబంధనలను విరుద్ధంగా జరుగుతున్న రిజిస్ట్రేషన్లపై బుధవారం జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ విచారణ చేపట్టారు. అక్రమ రిజిస్ట్రేషన్లపై ఫిర్యాదులు రావడంతో స్టాంపు రిజిస్ట్రేషన్ల శాఖ వరంగల్ డీఐజీ సుభాషిని ఆదేశాల మేరకు కార్యాలయంలో అధికారులు విచారణ నిర్వహించారు. వైరా ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ కరుణను ప్రశ్నించి రికార్డులు పరిశీలించారు. ముఖ్యంగా వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతమైన ఏన్కూరు మండలంలో 1/70అమలులో ఉన్న నేపథ్యంలో ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయకూడదనే ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని తోసిరాదని కుటుంబ సభ్యుల పేర్లతో పార్టేషన్ పేరిట రిజిస్ట్రేషన్లు చేస్తున్న బాగోతంపై అధికారులు ఆగ్రహంగా ఉన్నారు. ప్రైవేట్ బ్యాంకులకు చెందిన పలువురు ఏజెంట్ల మధ్యవర్తిత్వంతో ఇక్కడ కొంతమంది డాక్యుమెంట్ రైటర్ల సహకారంతో భారీగా ముడుపులు దండుకుంటూ పార్టేషన్ పేరిట 200కుగాపైగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేయటాన్ని అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. అలాగే వైరా, కొణిజర్ల మండలాల్లో లేఅవుట్ లేని స్థలాలకు అక్రమంగా రిజిస్ట్రేషన్లు, గిఫ్ట్ రిజిస్ట్రేషన్ల పేరిట కూడా నిబంధనలకు తూట్లు పొడిచారనే విమర్శలున్నాయి. వీటన్నింటిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడితే ఇక్కడ జరుగుతున్న అక్రమాల దందాను వెలికితీసే అవకాశముందని పలువురు పేర్కొంటున్నారు.

వనజీవిని కలిసిన అటవీ అకాడమీ శిక్షణ అధికారులు



వనజీవి రామయ్యను సన్మానిస్తున్న అటవీ అధికారులు

ఖమ్మం రూరల్, మార్చి 27: మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పద్మశ్రీ వనజీవి రామయ్యను హైదరాబాద్‌లోని అటవీ అకాడమీ శిక్షణ బీట్ అధికారులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పర్యావరణానికి వనజీవి చేసిన కృషిని వారికి వివరించారు. అడవులను ఎలా రక్షించాలి, అటవీ జంతువులను ఎలా కాపాడాలని, అడవులు అంతరించిపోతే మానవాలికి కలిగే ప్రమాదం గురించి వనజీవి రామయ్య వారికి అవగాహన కల్పించారు. మొక్కల పెంపకానికి కృషి చేయాలని కోరారు. అనంతరం వనజీవి రామయ్య, జానమ్మ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి రేంజ్ అధికారి శ్రీనివాస్‌రావు, శిక్షణ డిప్యూటీ రేంజ్ అధికారి ఉమా, అధికారులు, సిబ్బంది, శిక్షణ అధికారులు పాల్గొన్నారు.

11 ఏళ్ల చిన్నారి జీర్ణకోశం నుంచి వెంట్రుకల తొలగింపు



ఆసుపత్రిలో కోలుకుంటున్న చిన్నారిని పరిశీలిస్తున్న వైద్యులు (ఇన్‌సెట్‌లో బాలిక కడుపులోనుంచి తొలగించిన వెంట్రుకలు)

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 27: ఖమ్మం నగరంలోని ఓఆసుపత్రిలో పదకొండేళ్ల చిన్నారికి వైద్యులు అరుదైన ఆపరేషన్ నిర్వహించారు. బాలిక కడుపులో జీర్ణాశయానికి అడ్డుగా పేరుకుపోయిన 25సెంటీ మీటర్ల పొడవు, 10సెంటీ మీటర్ల వెంట్రుకల ముద్దను తొలగించారు. 11ఏళ్ల చిన్నారి శరణీ గత కొన్ని నెలలుగా తీవ్రంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. పలు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుంటున్నా నొప్పి తగ్గడం లేదు. చివరికి ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చూపించగా అక్కడి వైద్యులు పాపను క్షుణ్ణంగా పరీక్షించి పాప కడుపులో వెంట్రుకలు ఉన్నట్లు గుర్తించారు. దాంతో ఆ చిన్నారి వ్యక్తిగత వివరాలు తెలుసుకోగా ఆమె తరచూ వెంట్రుకలు నోట్లో పెట్టుకుని నమలటం చూశామని తల్లిదండ్రులు చెప్పడంతో మరిన్ని పరీక్షలు చేసి జీర్ణకోశంలో వెంట్రుకలు ముద్దగా అడ్డున్నట్లు గుర్తించారు. దాంతో ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ ఆనంద్‌గౌడ్ పాప తల్లిదండ్రులకు పరిస్థితిని వివరించి ఆపరేషన్ నిర్వహించారు. చిన్నారి కడుపులో సుమారు 25 సెంటీమీటర్ల పొడవు 10సెంటీమీటర్ల వెడల్పుతో ఉన్న వెంట్రుకల ఉండను తొలగించారు. ఇవి జీర్ణాశయంలోకి ఆహారాన్ని వెళ్లనివ్వకుండా అడ్డుగా ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ చిన్నారి ఆరోగ్యం మెరుగ్గా ఉందని క్రమేపీ కోలుకుంటున్నట్లు వైద్యులు వెల్లడించారు. వెంట్రుకలు నమలడం అనేది ఒక మానసిక వ్యాధి అని, దీన్ని ట్రైకోఫేజియా అంటారని ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ అన్వర్ తెలిపారు. మానసిక సమస్యల కారణంగా ఈ జబ్బు వస్తుందని ఆయన పేర్కొన్నారు. నెలల తరబడి కడుపులో వెంట్రుకలు పేరుకుపోవడాన్ని ట్రైకోబెజర్ అంటారని వైద్యులు వివరించారు.

సర్వే సరే..హద్దులేవీ ?

▸ రైతులకు నోటీసులిచ్చి నెలలు గడుస్తున్నా.. పట్టించుకోని అధికారులు ▸ అన్యాక్రాంతమైన భూములపై కోర్టుకు వెళ్లనున్న దేవాదాయ శాఖ



ఆలయ భూముల్లో దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన బోర్డు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి27: కార్పొరేషన్ ఒకటవ డివిజన్ ఖైకోండాయిగూడెం శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ భూములు అన్యాక్రాంతం అయ్యాయని అధికారులు సర్వేకు రావడం వెనుదిరగడం పరిపాటిగా మారింది. మూడు దఫాలుగా సర్వే నిర్వహించి, రైతులకు నోటీసులు ఇవ్వడం షరా మామూలైంది. అయినా ఫలితం లేకపోవడంతో అధికారులు ఈ భూముల వ్యవహారం కోర్టులోనే తెలుసుకోవాలని ఆలయ భూములపై కోర్టులో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీంతో స్థానిక ప్రజలు శివయ్య భూముల సర్వే జరిగేనా, భూమి ఆలయానికి వస్తుందా అనే అనుమానాలు ఉన్నాయని వాపోతున్నారు. దీనికి సంబంధించి గత గురువారం ఆలయ భూముల సర్వే చేసేందుకు వచ్చి కేవలం రైతులతో మాట్లాడి మరలా వచ్చి సర్వే చేస్తామని వెనుతిరిగి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

వాస్తవానికి గతంలోనే ఈ రైతులందరికీ భూమి విషయమై నోటీసులు అందించారు. 2021 డిసెంబరు10న ఆంధ్రజ్యోతిలో ముక్కంటి భూములపై పూజారి కన్ను, డిసెంబర్ 31న బోర్డు పెట్టారు సర్వే మరిచారు, 2022 ఆగస్టు 21న దేవుడికే శఠగోపం అనే శీర్షకలు ప్రచురించడం జరిగింది. ఆంధ్రజ్యోతి దిన పత్రికలో వచ్చిన ప్రతిసారి అధికారులు రావడం రైతులతో మాట్లాడటం వెళ్లడం తప్ప భూముల సర్వే మాత్రం నిర్వహించడం లేదు. దీనికి ముఖ్య కారణం కొందరు అధికార పార్టీ నాయకుల అండ కారణంగానే ఈ భూముల సర్వే జరగడం లేదని తెలుస్తోంది. ప్రస్తుత ధరణిలో కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం పేరిటనే 20.24 ఎకరాల భూమి ఉన్నట్లు రికార్డుల్లో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం సుమారు 12 ఎకరాలు కూడా కనిపించడం లేదు. ఈ భూముల విలువ ప్రస్తుతం రూ.కోట్లలో పెరగడంతో ఈ భూమిని సొంతం చేసుకోవాలనే ఆశతో కొందరు సర్వే జరగనివ్వకుండా అడ్డంకులుగా ఉన్నారనే ఆరోపణలు వినబడుతున్నాయి.

సుమారు వందేళ్ల క్రితం ఓ దాత శివాలయ పోషణకు 22.24 ఎకరాల భూమిని దానంగా ఇచ్చి ఆ భూమిని శివాలయం పేరిట రాసి ఇచ్చారు. ఈ భూములపై వచ్చే కౌలుతో పూజారి, ఆలయ నిర్వాహణ జరపాలనే ఉద్దేశ్యంతో దానంగా ఇచ్చారు. 2020లో ఈ ఆల యం దేవాదయ శాఖ పరిధిలోకి వెళ్లడంతో కొందరికి నచ్చక ఈ భూముల సర్వేకు అడ్డు తగులుతున్నారనే వాదనలు వినపడుతున్నాయి. ప్రస్తుతం ఈ ఆలయ భూములను 20.24 ఎకరాలుగానే దేవాదాయశాఖ ప్రతి ఏడాది వేలం నిర్వహిస్తుంది. సుమారు రూ.లక్ష 20 వేలకు పైగా ఆదాయం వస్తున్నట్లు అధికారులే చెబుతున్నారు. అధికారులు ఈ ఆలయ భూముల సర్వేను నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అన్యాక్రాంతం అవుతున్న భూములు

ఆలయం 2020లో దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్లినప్పటికీ పూర్తిస్థాయి కమిటీ లేకపోవడం కూడా కారణం అని, కమిటీని నియమిస్తే ఆలయ భూముల పరిరక్షణ చూసుకుంటుందని స్థానికుల వాదన. దేవాదాయ శాఖ ఆధీనంలో లేనప్పుడు గ్రామానికి చెందిన పలువురు ఆలయ కమిటీ ఏర్పాటు చేశారు. కాని వారు ఆలయ భూములు కాపాడటంలో విఫలం కావడంతోనే భూములు అన్యాక్రాంతం అయినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. వందల ఎకారాల భూములను సర్వేలు చేసి ఆలయాలకు అప్పగించే దేవాదాయ శాఖ, కేవలం 22 ఎకరాల భూములను మూడేళ్లుగా తాత్సరం చేస్తున్నారంటే అనుమానాలు కలుగుతున్నాయని కొందరు డివిజన్ ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా ఆలయానికి పూర్తిస్థాయి కమిటీని నియమించి ఆలయ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత దేవాదాయ శాఖ అధికారులు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బ్రూణహత్యలపై ప్రభుత్వానిదే బాధ్యత: పీవోడబ్ల్యూ

సత్తుపల్లి, మార్చి27: రాష్ట్రంలో రోజురోజుకు బ్రూణహత్యలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయని, వీటికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.శిరోమణి అన్నారు. బుధవారం సత్తుపల్లిలోని నీలం రామచంద్రయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో డబ్బు ల కోసం యాజమాన్యం తల్లి కడుపులోని పసిగుడ్డులను చిదిమేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో గోకినేపల్లి లలిత, మంగతాయి, రూప్సీ, శోభ, పూలమ్మ, కోటమ్మ, పరిమళ, వెంకట నరసమ్మ, సరోజిని, సత్యవతి, లలిత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శిరోమణి

పోలీసుల తనిఖీల్లో రూ.4.30 లక్షలు స్వాధీనం



ఇల్లెందు మండలంలో తనిఖీల్లో నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

ఇల్లెందు, మార్చి 27: భద్రాద్రి జిల్లా ఇల్లెందు మండలం, రేంపేడ్ చెక్‌పోస్టు వద్ద బుధవారం సాయంత్రం వాహన తనిఖీల్లో పోలీసులు రూ.4.30లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఆళ్లపల్లి మండల, పెద్దవెంకటాపురం గ్రామానికి చెందిన కల్తిసత్యనారాయణ, కల్తిమంగయ్య బోలెరో వాహనంలో వెళుతుండగా ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి కుమారస్వామి, పోలీస్ ఏఎస్ఐ గని ఆ వాహనాన్ని తనిఖీ చేయ గా ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.4.30లక్షల నగదును వారి నుం చి స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అయితే తాము ఖమ్మం మార్కెట్‌లో మిర్చి అమ్ముకుని వస్తున్నామని సంబంధిత వ్యక్తులు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే సదరు నగదుకు ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో ఎన్నికల నియమావళి ప్రకారం డబ్బును సీజ్ చేశామని తనిఖీ అధికారులు తెలిపారు.

జూలూరూపాడు: ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వైరా నియోజకవర్గ ఎన్నికల స్క్వాడ్ అధికారి రమణ తెలిపారు. బుధవారం జూలూరుపాడులోని ఒంటిగుడిసె క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జీవన్‌రాజు, సిబ్బంది కోటేశ్వరరావు, కుటుంబరావు పాల్గొన్నారు.

ఇల్లెందు: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఇల్లందు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను బుధవారం డీఎస్పీ చంద్ర భాను విస్తృతంగా తనిఖీ చేశారు. వాహనా లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.



జూలూరుపాడులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కానిస్టేబుళ్లకు అభినందన



కానిస్టేబుళ్లకు క్యాష్ రివార్డును అందజేస్తున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

మణుగూరు , మార్చి 27: తమ విధి నిర్వహిస్తూనే, ప్రమాదవ శాత్తు ప్రాణాపాయ స్థితికి చేరుకున్న ముగ్గురిని ఎంతో ధైర్య సాహసాలు చేసి వారి ప్రాణాలను కాపాడిన కానిస్టేబుళ్లను మణుగూరు డీఎస్పీ రవీందరెడ్డి, సీఐ సతీష్‌కుమార్‌లు బుధవారం అభినందించారు హోలీ పండుగ రోజున మండలానికి చెందిన సమితి సింగారం గ్రామ యువకులు గోదావరి నదిలో ప్రమాదవశాత్తు మునిగిపోతూ ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు. ఈక్రమంలో సమీపంలో విధులు నిర్వహించే టీఎస్పీసీ కానిస్టేబుల్ వినయ్‌తో పాటు, మణుగూరు కానిస్టేబుల్ సత్యనారాయణలు వారిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. తమ ప్రాణాలను లెక్క చెయ్యకుండా యువకులను కాపాడిన కానిస్టేబుళ్లను వారు అభినందిస్తూ, క్యాష్ రివార్డు అందజేశారు.

ఇల్లందుటౌన్: ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి సీపీ ఆర్ చేసి కాపాడిన కానిస్టేబుల్ నాగరాజును బుధవారం రజక సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర నాయకులు కంచర్ల శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు దుంపటి కృష్ణ, మల్లయ్య, శ్రీనివాస్, రామచందర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



కానిస్టేబుల్ నాగరాజును సన్మానిస్తున్న దృశ్యం

గ్రామాల్లో విజృంభిస్తున్న జ్వరాలు

▸ చింతిర్యాలగూడెం, సండ్రలబోడు గ్రామాల్లో జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

▸ వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని గ్రామస్థుల వినతి



చింతిర్యాలగూడెంలో జ్వరంతో బాధపడుతున్న మహిళ

మణుగూరు, మార్చి27: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని అశ్వాపురం మండలంలోని రెండు గిరిజన ఆదివాసీ గ్రామాలు వైరల్ ఫీవర్లతో విలవిలలాడుతున్నాయి. చింతిర్యాలగూడెం, సండ్రలబోడు గ్రామాల్లో వైరల్ ఫీవర్లు విజృంభిస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. జ్వర పీడితులు అశ్వాపురం లోనివైద్యశాలను ఆశ్రయిస్తే, అక్కడ జ్వరాలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించే వెసులు బాటు లేదు. ఆసుపత్రికి వచ్చే వారికి అక్కడి సిబ్బంది మణుగూరు ఆసుపత్రికి పొమ్మని చెబుతున్నట్లు సమాచారం. అయితే ఇక్కడి వస్తే ఇక్కడికెందుకు వచ్చారు. అక్కడే చూపించుకోండంటూ మణుగూరు ఆసుపత్రిలో కొందరు సలహాలు ఇస్తున్నట్లు తెలిసింది. చింతిర్యాలలో 120 కుటుంబాలు, సండ్రలబోడులో దాదాపు 160 కుటుంబాలు నివాసముంటుడగా ఇంటికి ఇద్దరు, ముగ్గురు చొప్పున వైరల్ ఫీవర్లతో ఇబ్బందులు పడుతున్నారు. కనీసం సర్వేలు కూడా చేపట్టే చర్యలను స్థానిక వైద్య శాఖ సిబ్బంది చేపట్టకపోవడం శోచనీయంగా మారింది. ఆర్థిక స్తోమత అంతంత మాత్రమే ఉన్న ఈ కుటుంబాలకు సర్కారు వైద్యం తప్ప ప్రైవేటు వైద్య శాలకు పోయే పరిస్థితులు లేవు. అశ్వాపురం తాముండే గ్రామం నుంచి మణుగూరు, లేదా భద్రాచలం ప్రైవేటు ఆస్పత్రులకు పోయి వైద్య సేవలు పొందటం శక్తికి మించిన పనిగా మారిందని వాపోతున్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కారేపల్లిలో ముగిసిన ఉపాధిహామీ ఫోరం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శిరీష

కారేపల్లి, మార్చి 27: కారేపల్లి మండలంలో రెండు రోజులుగా నిర్వహించిన ఉపాధి ఇన్నరర్ ఫోరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ శిరీష మాట్లాడుతూ ఉపాధి హమీ పనుల నిర్వహణలో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. అక్రమాలకు పాల్పడిన వారికి రూ.60వేలు పెనాల్టీ విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శ్రీదేవి, ఏపీవో పవన్, అంబుడ్స్ మెన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మం రూరల్, మార్చి 27: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజీవ్‌గృహకల్పలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రాజీవ్‌గృహకల్పలో నివాసం ఉంటున్న షేక్ సలీం (33) కారు మెకానిక్‌గా పని చేస్తుంటాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక మద్యానికి బానిస కావడంతో కుటుంబంలో కలహాలు చోటు చేసుకున్నాయి. దీంతో మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన సొసైటీ డైరెక్టర్ రోశయ్య



రోశయ్యకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కారేపల్లి, మార్చి 27: సీతరాంపురం గ్రామానికి చెందిన కారేపల్లి సహకార పరపతి సంఘం డైరెక్టర్ మర్సకట్ల రోశయ్య బుధవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సమక్షంలో పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎన్నికైన రోశయ్య సొసైటీ ఛైర్మన్ దిగ్గినేని శ్రీనివాసరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బానోత్ రాంమూర్తి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బొల్లా రమేస్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మూడు ఇసుక లారీలు సీజ్



పోలీస్‌స్టేషన్ వద్ద ఇసుక లారీలు

సత్తుపల్లి, మార్చి 27: ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న మూడు లారీలను బుధవారం సత్తుపల్లిలో ఖమ్మం టాస్క్‌ఫోర్స్ అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన లారీలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎనిమిది మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి పట్టణ సీఐ టీ.కిరణ్ తెలిపారు. సత్తుపల్లి పరిసర మండలాలకు ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న విషయంపై 'సరిహద్దున ఇసుక దందా' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడిన విషయం విధితమే. కొందరు వ్యాపారులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి అధికారికంగా ఇసుక పర్మిట్లతో వేరే ప్రాంతానికి పర్మిట్ తీసుకొని ఇసుకను నిబంధనలను అతిక్రమించి సత్తుపల్లి ప్రాంతానికి తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇసుక అక్రమ రవాణాకు ఏ స్థాయిలో ఎవరెవరు సహకరిస్తున్నారనే విషయంపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు అందినట్లు తెలిసింది. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదేశాలతో సత్తుపల్లి ప్రాంతంపై అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఇందులో భాగంగానే బుధవారం అధికారులు దాడులు నిర్వహించి మూడు ఇసుక లారీలను సీజ్ చేశారు.

టీఎన్జీవో సంఘంపై అవాస్తవాలను ప్రచారం చేయొద్దు

● కలెక్టరేట్‌లో టీఎన్జీవో ఓ వర్గం నేతల నిరసన

ఖమ్మం కలెక్టరేట్, మార్చి27: ఇటీవల కాలంలో టీఎన్జీవో సంఘంపైన అవాస్తవాలని ప్రచారం చేయడాన్ని ఖండిస్తూ బుధవారం ఖమ్మం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయాల్లో టీఎన్జీవో నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అవాస్తవాలను, వ్యతిరేక వార్తలను అంటగడుతూ టీఎన్జీవో సంఘంపై దుష్ప్రచారానికి పాల్పడడాన్ని ఖమ్మం జిల్లా టీఎన్జీవో నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు తెలిపారు. 33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, కేంద్ర సంఘం నాయకులు అందరూ ఏకగ్రీవంగా మారం జగదీశ్వర్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, కేంద్ర కమిటీ అధ్యక్షుడిగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఒక ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగాయి తప్ప ఎక్కడా తప్పు జరుగలేదని తెలియజేశారు. టీఎన్జీవో సంఘం ఎల్లప్పుడూ ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేసిందని, ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేదని తెలిపారు. టీఎన్జీవో కేంద్ర సంఘానికి ఎల్లప్పుడూ మద్దతుగా నిలబడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొనిదెన శ్రీనివాస్, పొట్టపింజర రామయ్య, గంగవరపు బాలకృష్ణ, హనుమంతరావు, గుంటుపల్లి శ్రీనివాస్ రాజేష్, వెంకట్రావు, కట్టా నవీన్, రాజ్ కుమార్, భీముడు, సంధ్య, లలిత, గోపయ్య, రవిచంద్ర, కల్పన, శ్రీకాంత్, విజయ్ మూర్తి, రమణ, టీబుసాబ్, వెంకటేశ్వర్లు, మాధవ రావు, కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న టీఎన్జీవో నేతలు

కిన్నెరసానిలో ముగిసిన క్రీడాకారుల ఎంపిక

పాల్వంచ రూరల్, మార్చి27: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న మోడల్ క్రీడా పాఠశాలల బాలురు (కిన్నెరసాని), బాలికలు (కాచినపల్లి)కు ప్రవేశాల కోసం ఎంపికలు రెండో రోజు బుధవారం కిన్నెరసాని మోడల్ క్రీడా పాఠశాలలో నిర్వహించారు. బాలురు 31, బాలికలు 15 మంది మొత్తం 46మంది హాజరయ్యారు. ఎంపికలకు పర్యవేక్షకులుగా క్రీడల అధికారి బొల్లి గోపాలరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో కొమరం వెంకట నారాయణ, ఎస్‌వోఎస్ నాగేశ్వరరావు, బాలుర ఇన్‌చార్జి బుగ్గ వెంకటేశ్వర్లు, పీడీ బాలికల ఇన్‌చార్జి అన్నం వెంకటేశ్వర్లు, బ్యాటరీ టెస్ట్ ఇన్‌చార్జిలు వెంకటేశ్వర్లు, పీడీ రాంబాబు, పీడీఎస్ రామారావు, పీడీ వెంకటేశ్వర్లు, పీఈటీ మోతాలాల్, పీడీ కృష్ణ, గోపాలరావు, శిరోమణి, రవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

దుమ్ముగూడెం మార్చి 27: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన సంఘటన సీతానగరంలో జరిగింది. సీతానగరానికి చెందిన కొప్పుల నీలంకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ఇంట్లో ఉన్న సామాగ్రి కాలి బూడిదైంది. మాజీ సర్పంచ్ తెల్లం వరలక్ష్మి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

వనమా కుటుంబ సభ్యుల భూములపై విచారణ చేయండి

● బీజేపీ నాయకుల ఆరోపణ

పాల్వంచ, మార్చి27: మాజీ మంత్రి, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న భూములపై సమగ్ర విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం పాల్వంచ తహసీల్దార్ వివేక్‌ను కలిసి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల్వంచ రెవెన్యూ గ్రామంలోని సర్వే నెంబర్ 999లో ప్రభుత్వ, అసైన్‌మెంట్ భూములను వనమా కుటుంబ సభ్యులు కబ్జా చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపాక రమేష్, మాదారపు లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతి

మణుగూరుటౌన్, మార్చి27: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ-2 బేస్ వర్క్‌షాప్‌లో విధులు నిర్వహిస్తోన్న ఉద్యోగి సాంబమూర్తి(54) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు రోజు మాదిరిగా విధులకు వెళ్లి ఇంటికి వెళ్తుండగా, సమితిసింగారం సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడిని పరిక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు.

ఇద్దరు యువకులకు గాయాలు

జూలూరుపాడు: మండలంలోని బేతాళపాడు పంచాయతీ పరిధిలోని పంతులతండా గ్రామానికి చెందిన గుగులోత్ వినయ్, ఇస్లావత్ సాయికుమార్‌లు కలిసి జూలూరుపాడుకు వచ్చారు. ఓ పెట్రోల్ బంక్ వద్ద ద్విచక్రవాహనంలో పెట్రోల్ పోయించుకొని రహదారిని దాటుతుండగా, ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న టీఎస్33ఈ2367 నెంబర్ గల కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి.

మోరీలో పడి వ్యక్తి మృతి

పాల్వంచ, మార్చి 27: మద్యం మత్తులో మోరీలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన పాల్వంచలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన గొల్లవేణి గోపి కృష్ణ(35) స్థానికంగా కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మనస్పర్థలతో కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. భార్యపిల్లలకు దూరంగా ఉండటాన్ని భరించలేక అతిగా మద్యం సేవించి అల్లూరి సెంటర్‌లోని మోరీపై నుంచి కాలువలో పడి మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాల్వంచ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ అడిషనల్ ఎస్ఐ రాఘవయ్య తెలిపారు.


ఎక్స్‌కవేటర్‌తో చెరువు లోపల మట్టిని తవ్వుతున్న దృశ్యం

చెరువుల్లో మట్టి..
హాంఫట్

పలు గ్రామాల్లో కొంత మంది పొలాలకు చెరువు మట్టి తరలించే ముసుగులో దందా సాగిస్తున్నారు. పేరువంచ, చెన్నూరు, కప్పలబంధం, బత్తులపల్లి చెరువుల్లో మట్టి అక్రమంగా తవ్వకాలు సాగిస్తున్నారు.పంట పొలాల్లో భూమిని చదును చేయడానికి, భూసారాన్ని పెంచడానికి రైతులు చెరువుల్లోని నల్లరేగడిని వినియోగిస్తారు. రైతులు ముందుగా చెరువు మట్టిని తవ్వి పొలాలకు తరలించే విషయంలో జలవనరుల శాఖ అధికారులకు తమ భూమి సర్వే నెంబర్‌తో కూడినా పాస్ పుస్తకాలతో అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి దరఖాస్తు దారుడైన రైతు పొలానికి ఎంత మట్టి అవసరమో అంచనా వేయాలి.అయితే క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా అనుమతిస్తుండటంతో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు.

- పొలాల సారం పెంపు ముసుగులో దందా
- యంత్రాలతో నల్లరేగడికి బదులుగా ఎర్రమట్టి తరలింపు
- నీటి వనరుల అడుగు భాగంలో యంత్రాలతో గోతులు
- చర్యలు తీసుకొంటాం: జలవనరులశాఖ ఈఈ

కల్లూరు, మార్చి 27: మండలంలోని ఒక్క చెన్నూరు గ్రామంలోనే ఓ వ్యక్తి తన రాజకీయ బలాన్ని ఉపయోగించి సుమారు 1000 ట్రాక్టర్ల ఎర్ర మట్టిని తన సొంత ప్లాట్‌లకు తరలించాడని వినికిడి. ఇంకాను ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్ తరలించి అక్రమంగా వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. పేరువంచ, కృప్పలబంధం, బత్తుపలి, వెన్నవల్లిలో కొంతమంది ఇదే ఆవకాశంగా భావించి పంట పొలాలకు తరలించే ముసుగులో ట్రక్కు మట్టిని డిమాండును బట్టి రూ.400 నుంచి రూ.1000 వరకు అమ్ముతున్నట్లు సమాచారం.


రావికంపాడు చెరువు గొయ్యి

ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు

మండలంలోని పలు గ్రామాల్లో కొంతమంది వ్యక్తులు రాజకీయ అండదండలతో అక్రమంగా చెరువుల్లో తవ్వకాలు చేస్తున్నారు. ఏమాత్రం జంకు లేకుండా యంత్రాలను తీసుకువచ్చి మట్టిని తరలిస్తున్నారు. పొలాలకు మట్టి తరలించేందుకు అనుమతి పొందిన వారిలో కొంతమంది చెరువుల్లో నల్ల మట్టికి బదులుగా ఎర్ర మట్టిని తవ్వుతున్నారు. చెరువుల్లో ఒకే చోట లోతుగా తవ్వడంతో గోతులు ఏర్పడుతున్నాయి. ఇలా క్షేత్ర స్థాయిల్లో చెరువుల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్న అధికారులు మాత్రం సదరు చెరువులను సందర్శించడం లేదు. ఇప్పటికైన అధికారుల స్పందించి చెరువుల్లో పూర్తి నీటి సామర్థ మట్టానికి ప్రమాదం ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

సమాచారం అందితే చర్యలు..

చెరువుల్లో మట్టిని పంట పొలాలకు వినియోగిస్తామని పలువురు రైతులు దరఖాస్తులు చేసుకుంటే వాటిని అనుమతి ఇచ్చినట్లు కల్లూరు జలనవరులశాఖ ఈఈ లక్ష్మీనారాయణ తెలిపారు. చెరువులో మట్టితో వ్యాపారం చేస్తున్నట్లు, అక్రమంగా తరలిస్తున్నట్లు తమకు సమాచారం ఇస్తే తగిన విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది కొరత వల్ల తాము క్షేత్ర స్థాయిలో సందర్శించటం, సమాచారం తెలుసుకోవటంలో ఇబ్బందిగా మారిందన్నారు.


పేరువంచలో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్

జాతీయస్థాయి పరీక్షలో సాయి శ్రీసాత్విక్ ప్రతిభ



భద్రాచలం, మార్చి 27: 'ఎంఐ చాంప్స్ ఇండియా' జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో భద్రాచలం సెయింట్ పాల్స్ విద్యార్థి సాయి శ్రీసాత్విక్ ప్రథమ స్థానం సాధించాడు. మార్చి మొదటి వారంలో మేథమేటిక్స్, ఇంగ్లీష్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఇందులో భద్రాచలం సెయింట్ పాల్స్‌లో ఆరో తరగతి చదువుతున్న సాయి శ్రీ సాత్విక్ ప్రథమ స్థానం సాధించడం విశేషం. దీంతో ఆ విద్యార్థికి నిర్వాహకులు జ్ఞాపిక, రూ.35వేల విలువైన లాప్టాప్ తో పాటు సర్టిఫికెట్‌ను అందజేశారు. విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ డా. కే అబ్రహం, ప్రధానోపాధ్యాయురాలు డా. కె. రాధామంజరి అభినందించారు.

ఎస్‌ఎంహెచ్ కమిటీ సభ్యుడిగా కంభంపాటి



ఖమ్మం కలెక్టరేట్, మార్చి27: తెలంగాణ రాష్ట్ర మెంటల్ హెల్త్ కమిటీ (ఎస్ఎంహెచ్) సభ్యుడిగా ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ మానసిక వైద్యుడు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కంభంపాటి నారాయణరావు నియమితులయ్యారు. మెంటల్ హెల్త్ కమిటీని రాష్ట్రస్థాయిలో గురువారం ప్రకటించారు. ఈ కమిటీలో అడ్వైజర్, ఛైర్మన్ , కో ఛైర్మన్, కన్వీనర్, సభ్యులు ఉంటారు. తొలిసారిగా ఖమ్మం జిల్లాకు చెందిన డాక్టర్ కంభంపాటి నారాయణరావుకు ఈ కమిటీలో సభ్యుడిగా అవకాశం లభించింది. సభ్యుడిగా ఎన్నికైన నారాయణరావును ఐఎంఏ నాయకులు, నగరానికి చెందిన పలువురు వైద్యులు అభినందించారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

- జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్

కామేపల్లి, మార్చి 27: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్ సూచించారు. బుధవారం కొమ్మినేపల్లి పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామంలో మంచీనీట సమస్యలు రాకుండా చూడాలని అవసరమైతే రైతుల బావుల వద్ద నుంచి ప్రత్యేక లైన్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇంటి పన్నులు వందవాతం వసూలు చేయాలని సూచించారు. అంతే కాకేండా పంచాయతీ డెవలప్మెంట్ ఇన్‌డెక్స్‌పై సమీక్షించారు. వారంతపు సంత బుధవారంతో గుత్తేదారుడుకి కాంట్రాక్ట్ ముగిసింది. జిల్లా ఉన్నతాదికారుల ఆదేశాలతో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవిందర్, పంచాయతీ కార్యదర్శి గుగులోత్ నెహ్రూ పాల్గొన్నారు.

జిల్లా టీటీ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

ఖమ్మంస్పోర్ట్స్, మార్చి27: జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ నూతన ఎక్జిక్యూటివ్ కమిటీని బుధవారం నగరంలోని సీక్వెల్ రిసార్ట్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాలసాని విజయ్‌కుమార్, కార్యదర్శిగా ఓలేటి సాంబమూర్తి, ట్రెజరర్‌గా పరిటాల చలపతి, గౌరవాధ్యక్షుడిగా కొండా శ్రీధర్, డాక్టర్ జొన్నలగడ్డ శశికుమార్, రాయల సతీష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్లుగా కోటగిరి ప్రవీణ్, జంగా కార్తిక్, రవి, ప్రవీణ్, కామేశ్వరి, జాయింట్ సెక్రెటరీలుగా పర్వా శ్రావ్య, జాజి చాకోలను ఎన్నుకున్నారు. అబ్జర్వర్లుగా రాష్ట్ర టేబుల్‌టెన్నిస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నర్సింహారెడ్డి, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ అథ్లెటిక్స్ కోచ్ గౌస్ వ్యవహరించారు.

నాసిరకం ఇసుకతో సీసీ రోడ్ల నిర్మాణం

కామేపల్లి, మార్చి 27: నాసిరకం ఇసుకతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నారని ప్రభుత్వ ధనం వృదా అవుతుందని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాలే శ్రీను పంచాయతీరాజ్ ఈఈ వెంకటరెడ్డికి బుధవారం ఫిర్యాదు చేశాడు. కామేపల్లి మండల పరిధిలోని మద్దులపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గ్రామానికి రూ.10లక్షలు నిధులు మంజూరు అయ్యాయి. సీసీ రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్ గ్రామశివారులలో ఉన్న వాగుల నుంచి నాసిరకం ఇసుకను తీసుకువచ్చి నిర్మాస్తున్నాడని ఫిర్యాదుచేశాడు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఎవరు లేకుండా నిర్మాణం చేపడతున్నారని తెలిపారు. జిల్లా ఉన్నాతాధికారులు ప్రత్యేక చొరవ చూపించి నాణ్యతతో కూడిన నిర్మాణాలు చేపట్టాలని కోరారు. దీనిపై ఏఈ వాసుని వివరణ కోరగా నాణ్యత పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జమలాపురం హుండీ లెక్కింపు


జమలాపురంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం, మార్చి 27: ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం హుండీని దేవాలయం అధికారుల సమక్షంలో బుధవారం లెక్కించారు. గడిచిన 91రోజులకు గాను భక్తులు వారికి సమర్పించిన కానుకలు, నగదు రూ.32,87,440 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్‌మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుండే దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో హుండీలను తెరిచి ఆలయ ఆవరణలో దేవాలయ సిబ్బంది, శ్రీసత్యసాయిసేవాసమితి సభ్యులు లెక్కించారు.

ఎన్నికల సామగ్రి తరలింపునకు
రూట్‌మ్యాప్

- వీసీకి రాని అధికారులకు షోకాజ్ నోటీసులు
- భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్



భద్రాచలం, మార్చి 27: రాబోయే పార్లమెంటు ఎన్నికలలో పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని పంపిణీ చేయడానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అనుకూలమైన రూట్ మ్యాప్‌ను తయారుచేసి ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులను పినపాక నియోజకవర్గం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ సూచించారు. బుధవారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ మందిరం నుంచి పినపాక నియోజకవర్గంలోని ఎన్నికల, పోలీస్ అధికారులతో నియోజకవర్గం లోని పోలింగ్ కేంద్రాలకు లకు కల్పించవలసిన మౌలిక వసతుల గురించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలాల వారిగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల రూట్ మ్యాప్ ను తయారు చేసుకోవాలని అన్నారు. ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే రెండు రోజులలో వాటికి సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలన్నారు.

ఈ సమయంలో సెక్టోరియల్ అధికారులు డీఎస్పీల సహకారం తీసుకొని సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన రూట్ మ్యాప్ సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరించుకోవాలని ఆయన అన్నారు. పెండింగ్ లో ఉన్న 6, 7, 8, ఓటర్లకు సంబంధించిన ఫారం లను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్‌స్టేషన్లో టాయిలెట్స్, రాంపులు, వాష్ రూమ్, కరెంటు, సరిపడా ఫర్నిచర్ తప్పనిసరిగా ఉండాలని, అందుకు సంబంధిత సెక్టోరియల్ అధికారులు వారి రూట్ లోని పోలీస్‌స్టేషన్లు ఏవైనా అనుకూలంగా లేకపోతే ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ కి సంబంధించిన ఆశ్రమ పాఠశాలలు, జీపీఎస్ పాఠశాలలు, గురుకులం పాఠశాలలు పోలింగ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్సుకు గైర్హాజరైన సెక్టోరియల్ అధికారులకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఎలక్షన్ డీటీ నాగరాజును ఆదేశించారు.

భారీ బకాయిదారులపై
ప్రత్యేక దృష్టి పెట్టాలి


బకాయిదారులతో మాట్లాడుతున్న ఆదర్శ్‌సురభి

- పన్నులు చెల్లించకుంటే చర్యలు
- నగర పాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి

ఖమ్మంకార్పొరేషన్, మార్చి27: ఆస్తిపన్నులు భారీగా బకాయిపడిన వారిపై ప్రత్యేకదృష్టి పెట్టాలని నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి కోరారు. పన్నులు చెల్లించని వారికి తొలుత నోటీసులు ఇచ్చి, అనంతరం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బుధవారం కమిషనర్ నగరంలోని ముస్తఫానగర్, శ్రీనివాసనగర్‌లలో పర్యటించారు. భారీగా బకాయిలు ఉన్న వారి ఇళ్లకు, పాఠశాలలకు తిరిగి వారితో మాట్లాడి ఆస్తిపన్నులు వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే పన్నుల వసూళ్లకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాలను సందర్శించి, భారీ బకాయిలున్నవారి జాబితాను తీసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ భారీ బకాయిలు ఉన్నవారికి వడ్డీపై 90శాతం రాయితీ ఇస్తున్నామని, ఇంకా నాలుగురోజులే గడువు ఉన్నందున ప్రత్యేక అధికారులు, బిల్‌కలెక్టర్లు ఆయా బకాయిదారుల ఇళ్లకు వెళ్లి పన్నులు వసూలు చేయాలని కోరారు. ఎవరైతే గత ఏడాది పన్ను చెల్లించకుండా ఉండి, ఈ ఏడాది కూడా బకాయి పడితే తొలుత వారికి నోటీసులు ఇవ్వాలని, తరుపరి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బకాయిలు ఉన్న వారి పంపు కనెక్షన్‌లు తొలగించాలన్నారు. పాఠశాల, కళాశాలల భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్‌ల భవనాలకు సంబంధించి ఆస్తిపన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని,వారు పన్నులు చెల్లించకుంటే చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ వెంట సహాయ కమిషనర్ సంపత్‌కుమార్, ఆర్‌వో శ్రీనివాసరావు తదితరులున్నారు.

సీతారామ లింక్ కెనాల్ నిర్మాణానికి సహకరించాలి



- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య
- ఎకరానికి రూ.25లక్షలు చెల్లించాలని రైతుల డిమాండ్

జూలూరుపాడు, మార్చి 27: సీతారామ జలాలను ఏన్కూరులోని ఎన్నెస్పీకి తరలించేందుకు జూలూరుపాడులోని సీతారామ కాల్వ నుంచి ఏన్కూరు వరకు రూ.100కోట్లతో నిర్మిస్తున్న సీతారామ లెఫ్ట్ లింక్ కెనాల్ నిర్మాణానికి రైతులు సహకరించాలని సీతారామ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య కోరారు. ఇటీవల ఇరిగేషన్ అధికారులు కెనాల్ నిర్మాణానికి సంబంధించి భూమిని గుర్తించేందుకు సర్వే చేపడుతున్న క్రమంలో వినోభానగర్‌లో రైతులు వారిని అడ్డుకున్నారు. కెనాల్ నిర్మాణానికి తమ భూములను ఇవ్వబోమని చెప్పారు. దీంతో సర్వేలో జాప్యం జరగడానికి, రైతులు ఎందుకు అడ్డుకున్నారో గల కారణాలను తెలుసుకోవాలని కలెక్టర్ ప్రియాంక ఎస్‌డీసీని ఆదేశించారు. దీంతో బుధవారం సాయంత్రం ఆయన జూలూరుపాడులోని తహసిల్దార్ కార్యాలయం వద్ద పాపకొల్లు రెవెన్యూ పరిధిలోని వినోభానగర్, జూలూరుపాడు గ్రామాల రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. రైతుల అభిప్రాయాలను సేకరించారు. మండలంలో కెనాల్ నిర్మాణంతో సుమారు 50 ఎకరాల భూమిని కోల్పోతున్నామని, తమ భూములు ఎంతో విలువైనవని, బోర్లు ఉన్నాయని రైతులు ఆయనకు తెలిపారు. ఎకరానికి రూ.25లక్షల పరిహారాన్ని చెల్లిస్తేనే కెనాల్ నిర్మాణానికి భూములు ఇస్తామని రైతులు అన్నారు. ఈ సమావేశంలో ఈఈ అర్జున్, డీఈ చంద్రశేఖర్, తహసీల్దార్ స్వాతిబిందు, ఆర్ఐ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ.. సింగరేణితో పాటు ప్రకృతికి కూడా !

- వృత్తి సెక్యూరిటీ గార్డు.. ప్రవృత్తి మొక్కల పెంపకం..
- ఇంటి ఆవరణలోనే ఉద్యానవనం పెంపకం
- పలువురికి స్ఫూర్తినిస్తున్న వెంకటేశ్వర్లు

ఇల్లెందుటౌన్, మార్చి 27: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు సింగరేణి కార్మికుడు నిత్యం కృషి చేస్తున్నాడు. ప్రతి రోజు మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తు, మొక్కలను నాటి సంరక్షించాలని కోరుతు పర్యావరణాన్ని కాపాడుకునేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నాడు. ఇల్లెందు పట్టణంలో 24 ఏరియాలో సింగరేణి క్వార్టర్‌లో నివాసం ఉంటున్న సెక్యూరిటీ గార్డు దాట్ల వెంకటేశ్వర్లు పర్యావరణ పరిరక్షకుడిగా, పర్యావరణ ప్రేమికుడిగా గుర్తింపు పొందారు. నివాసం ఉంటున్న క్వార్టర్ సముదాంలోనే పలు రకాల పూలు, పండ్ల మొక్కలతో పాటు, వివిధ ఔషధ మొక్కలను పెంచుతూ ఉచితంగా అందిస్తున్నారు. వెంకటేశ్వర్లు తన ఇంటికి వచ్చే వారితో పాటు శుభకార్యాలయాలకు వెళ్లినప్పుడు కట్నకానుకలతో పాటు, మొక్కలను అందజేస్తున్నారు.


మొక్కలకు నీళ్లు పడుతున్న వెంకటేశ్వర్లు

పర్యావరణాన్ని అందరూ కాపాడుకోవాలి..



దాట్ల వెంకటేశ్వర్లు, సింగరేణి ఉద్యోగి

పర్యావరణాన్ని కాపాడటం ద్వారా భవిష్యత్ తరాలకు ఎంతో మేలు కలుగుతుంది. రోజు రోజుకు అడవులు తరిగిపోవడంతో పర్యావరణానికి జరుతున్న విఘాతం పూడ్చలేనిది. మొక్కలను పెంచాలనే ఆలోచన అందరికీ రావాలనే లక్ష్యంతోనే ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తున్నా. ప్రతీ పౌరుడు మొక్కలను పెంచేందుకు కొంత సమయం కేటాయించాలి.

కొలువుదీరిన పలు రకాలు..

వెంకటేశ్వర్లు పెంచుతున్న గార్డెన్‌లో పలు రకాల పూలు, పండ్ల, ఔషధ మొక్కలు కొలువుదీరాయి. ఇలాచీ, మధునాశిని(షుగర్‌మొక్క), ఇన్సులిన్, కిడ్నీలో రాళ్ల కరిగించే రణపాల మొక్క, నొప్పులను తగ్గించే కాడజెముడు, హస్తమాను తగ్గించే అడ్డరసం, దోమలను నివారించే లేమెన్‌గ్రాస్, లౌవ్‌బడ్స్ మొక్క, మొగళిపువ్వు, తెల్లఉశిరి, సింధూరం విత్తనాలు, ఇన్‌డోర్ మొక్కలను విరివిగా అందజేస్తున్నాడు. మొక్కలుగా నాటి చెట్లుగా పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతీఒక్కరిలో అవగాహన పెంచుతున్నారు. సింగరేణి సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తునే, మొక్కల పంపిణీ చేపట్టడం విస్తృతంగా చేపట్టడం విశేషం. వేసవిలో పక్షులకు ఆహారాన్ని అందించేందుకు వరి కంకులను పంపిణీ చేయడం అభినందనీయం.

ప్రతీ ఇంటికి తాగునీరు అందేలా చర్యలు

- భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక



కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 27: వేసవికాలంలో ఎండలు పెరుగుతున్న నేపధ్యంలో జిల్లాలోని ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ ఈఈ, డీఈలు, పబ్లిక్ హెల్త్ డీఈలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ప్రత్యేక అధికారులతో తాగునీటి సమస్య, పనుల పరోగతిపై టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి ఎద్దడి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చూడాలన్నారు. వేసవికాలంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. రాబోయే మూడు నెలల్లో గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఉన్న నీటి వసతులు అందుబాటులో ఉన్న అన్ని సౌకర్యాలు చేతిపంపులు, బోర్లు, మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం రాకుండా చూడాలన్నారు. బోర్లు, హ్యాండ్ పంపులు, మోటర్లు, పైపులైన్ల లీకేజీలకు అవసరమైన మరమ్మతులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో అన్ని నీటి సరఫరా ప్రాంతాలను ప్రతిరోజు విధిగా తనిఖీ చేసి నివేదిక సమర్పించాలన్నారు. అవసరం ఉన్న చోట బోర్‌వెల్స్ యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా అన్ని మండలాల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తానని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ముందుగాను తాగునీటి సరఫరాపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్ విద్యాచందన, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం, ఎంఈవోపై చర్యలు తీసుకోండి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ గౌతమ్
- పాఠశాల ఆవరణలో పంచాయతీ భవనం నిర్మాణంపై ఆగ్రహం

తల్లాడ, మార్చి 27: మల్సూర్‌తండా పాఠశాలల హెచ్‌ఎం, తల్లాడ ఎంఈవోపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో పంచాయతీ భవనం నిర్మాణంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం తల్లాడ మండలంలోని గొల్లగూడెం, అంజనాపురం, తెలగవరం, మిట్టపల్లి, మల్సూర్ తండా గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించి పోలింగ్ కేంద్రాల నిర్వహణను పరిశీలించారు. మల్సూర్ తండా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి చిన్నారులతో కలిసి భోజనం చేశారు. మిట్టపల్లిలో పల్లెదవాఖానాను కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించాలని సూచించారు. మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. మిట్టపల్లి పల్లె దవాఖానాలో మందుల స్టాక్, వ్యాక్సినేషన్ వివరాలను ఎంఎల్‌పీహెచ్ రాజశ్రీని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. మల్సూర్ తండా పాఠశాల ఆవరణంలో అనుమతులు లేకుండా పంచాయతీ కార్యాలయ భవనాన్ని నిర్మించటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.రవికుమార్, ఎంపీడీవో చంద్రమౌళి, ఎస్ఐ బి.కొండల్‌రావు, ఎంపీవో కొండపల్లి శ్రీదేవి పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాల నిర్వహణ గురించి ప్రశ్నిస్తున్న కలెక్టర్ గౌతమ్

నేటి నుంచి త్రీ స్టాప్ సర్వీసులు

- భద్రాచలం, ఖమ్మం మధ్య ప్రత్యేక ఆర్టీసీ డీలక్స్ బస్సులు
- 30వ తేదీ నుంచి విశాఖకు లహరి సీట్ కం స్లీపర్



భద్రాచలం, మార్చి 27: భద్రాచలం పట్టణం, ఖమ్మం నగరాల మధ్య త్రీస్టాప్ డీలక్స్ బస్సులను నేటినుంచి నడుపనున్నట్లు భద్రాచలం ఆర్టీసీ డీఎం వి. రామారావు బుధవారం తెలిపారు. ఈ బస్సులు ఖమ్మం, భద్రాచలం మధ్యలో పాల్వంచ, కొత్తగూడెం, ఏన్కూరులలో మాత్రమే ఆగుతాయి. ఖమ్మం త్రీస్టాప్ గురువారం భద్రాచలం నుంచి ఖమ్మానికి ఉదయం 6.00గంలకు, 7గంటలకు, 9.30, 9.30, 10.30, మధ్యాహ్నం 1.30, 2.30, 5గంటలకు, 6గంటలకు బయలు దేరుతుందని తెలిపారు. ఖమ్మం నుంచి భద్రాచలానికి ఉదయం 6గంటలకు, 7గంటలకు, 9.30, 10.30, మధ్యాహ్నం ఒంటిగంటకు, 1.30కు, 2.30కు, సాయంత్రం 5గంటలకు, 6గంటలకు బయలుదేరుతుందని అన్నారు. కాగా ఈ బస్సుల్లో ఆధార్‌కార్డుతో మహిళల ఉచిత ప్రయాణానికి అనుమతి లేదని తెలిపారు.

భద్రాచలం నుంచి విశాఖపట్నానికి లహరి సీట్ కం స్లీపర్ నాన్ ఏసీ బస్సులను ఈనెల 30వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. శనివారం భద్రాచలం నుంచి విశాఖపట్నానికి ఉదయం, రాత్రి 9 గంటలకు లహరి బస్సు బయలుదేరుతుందని తెలిపారు. విశాఖపట్నం నుంచి భద్రాచలానికి ఉదయం 8గంటలకు, రాత్రి8.45 గంటలకు లహరి బస్సు బయలుదేరుతుందని రామారావు వివరించారు.

పగిలిన పైపులైన్లకు మరమ్మతులు



వైరా,మార్చి27: వైరాలోని మధిర రోడ్డులో మంగళవారం ఎక్స్‌కవేటర్ తవ్వకాల సమయంలో పగిలిపోయిన మిషన్ భగీరథ పైపులైన్‌కు బుధవారం మరమ్మతులు చేశారు. కనీస సమాచారమివ్వకుండా అడ్డగోలుగా ఆర్‌అండ్‌బీ కాంట్రాక్టర్ అడ్డగోలుగా ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు జరపడంపై మిషన్ భగీరథ, ఆర్‌అండ్‌బీ అధికారుల మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. మిషన్ భగీరథకు చెందిన బోడేపూడి సుజల స్రవంతి ప్రధాన పైపులైన్ రోడ్డుపక్కనే ఉన్నందున నాలుగులైన్ల రోడ్డు నిర్మాణ సమయంలో తమకు కనీసం సమాచారం ఇవ్వలేదని ఆర్‌అండ్‌బీ అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. ఆతర్వాత మిషన్ భగీరథ అధికారులు పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు.

ఎన్నికల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ గౌతమ్
- ఎఫ్‌ఎస్టీ, ఎస్‌ఎస్టీ, ఎక్సైజ్, వ్యయ నియంత్రణ కమిటీలతో సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంకలెక్టరేట్, మార్చి27: స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎఫ్‌ఎస్టీ, ఎస్‌ఎస్టీ, ఎక్సైజ్, వ్యయ నియంత్రణ కమిటీతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం, ప్రలోభాలను నియంత్రించడానికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎఫ్‌ఎస్టీ, ఎస్‌ఎస్టిలలో సీజ్ అయిన వాటికి వెంటనే ఎఫ్‌ఐఆర్ అయ్యేలా చూడాలన్నారు. చెక్‌పోస్టుల్లో అన్ని రకాల వాహనాల తనిఖీలు చేయాలన్నారు. జప్తు సందర్భంగా నియమనిబంధనలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జిల్లా సహకార అధికారి మురళీధర్ రావు, అదనపు డీసీపీ ప్రసాద్‌రావు, జిల్లా రెవిన్యూ అధికారి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన అదనపు కలెక్టర్

మధిరరూరల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని మహదేవపురంలో పోలింగ్ బూత్‌ను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ సందర్శించి పరిశీలించారు. పోలింగ్ బూతుల్లో విద్యుత్, తాగునీరు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీవో శాస్త్రీ పాల్గొన్నారు.

మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి

ఖమ్మంకార్పొరేషన్: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన సరిగా ఉండాలని నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. నగరపాలకసంస్థ పరిధిలోని కొత్తూరు ప్రభుత్వ పాఠశాలలో,శాంతినగర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కమిషనర్ బుధవారం పరిశీలించారు. తాగునీరు, విద్యుత్, టాయ్‌లెట్లు తదితరు మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్వీప్ కార్యాచరణలో భాగంగా కాంపౌండ్‌గోడలపై ఓటరు అవగాహనకు సంబంధి ంచిన నినాదాలు రాయించాలని కమిషనర్ ఆదేశించారు.

తనిఖీలను పకడ్బందీగా నిర్వహించాలి

మధిరరూరల్: అంతర్రాష్ట సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తనిఖీలను పకడ్బందీగా నిర్వహించాలని ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం మధిర మండలం రాయపట్నం వద్ద అంతర్రాష్ట చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేయాలన్నారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్ తదితర వాటిని ఏర్పాటుచేయాలన్నారు.

గంగారం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ

సత్తుపల్లిరూరల్: ఎన్నికల నేపథ్యంలో ఏపీ, తెలంగాణ సరిహద్దు మండలంలోని గంగారం రింగ్‌సెంటర్‌లో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. అశ్వారావుపేట, చింతలపూడి వైపు నుంచి జాతీయ రహదారి గుండా వెళ్లే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. సరైన ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి నగదు లభ్యమైతే సీజ్‌చేస్తామని పట్టణ సీఐ టీ.కిరణ్ తెలిపారు.

గడువులోగా మిల్లింగ్ చేసి బియ్యం ఇవ్వాలి

- అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష




హాజరైన జిల్లా అధికారులు, సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్, మార్చి27: గడువులోగా (సీఎంఆర్) కస్టమ్ మిల్లింగ్ రైస్ లక్ష్యాలను పూర్తి చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ 2023-24 సంవత్సరానికి లక్ష్యాన్ని ప్రభుత్వ సూచించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు.లక్ష్యం సాధించని మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 223 కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో 152, ఐకేపీ ఆధ్వర్యంలో 42, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 30 కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ 1న ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో మౌలిక వసతులు విద్యుత్ సరఫరా, టాయిలెట్స్, టార్పాలిన్, ప్యాడి క్లీనర్స్, గన్నిసంచులు, వేయింగ్ మిషన్ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన తేమశాతం మేరకు ధాన్యం కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అకాల వర్షాల కారణంగా పంట ధాన్యం తడవకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రస్తుతం ఎన్నికల నియమ నిబంధనలు అమలులో ఉన్నందున రాజకీయ నాయకుల ద్వారా ప్రారంభోత్సవాలు చేయకూడదని ఆదేశించారు. ఎక్కడ రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సెంటర్ నిర్వాహకులకు సూచనలు చేశారు. ప్రతి కేంద్రంలో వ్యవసాయ శాఖ, ఐకెపి, సహకార శాఖ, హార్టికల్చర్, సంబంధిత అధికారులు, బృందంగా ఏర్పడి కొనుగోలు చేయాలని అన్నారు.కొనుగోలు చేయుటలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా సహకార అధికారి మురళీధర్ రావు, సివిల్ సప్లై డీఎం శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

కుర్నవల్లిలో వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవం



బొడ్రాయికి పూజలు చేస్తున్న భక్తులు



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తల్లాడ, మార్చి27: మండల పరిధిలో కుర్నవల్లి గ్రామంలోని వెంకటాచలపతి దేవాలయంలో 43అడుగుల అభయాంజనేయస్వామి, విఘ్నేశ్వర విగ్రహాలు, నాభిశిల (బొడ్రాయి) ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ప్రతిష్ఠా మహోత్సవానికి తల్లాడ, కల్లూరు, వైరా పరిసర మండలాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. అర్చకులు అవధానుల రవికుమార్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహించారు. గోవిందనామ స్మరణ, జైశ్రీరామ్ నినాదాలతో మారుమోగిపోయింది. ఆడపడుచులు, బంధుమిత్రుల రాకతో ప్రతి ఇంటా సందడి నెలకొంది. వెంకటాచలపతి దేవాలయం పరిసరాలు, ప్రధాన వీధులన్నీ భక్తులతో నిండిపోయాయి. అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

30న అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి27: ఖమ్మంకార్పొరేషన్ 1వడివిజన్ కైకొండాయిగుడెం వెళ్ళే ప్రధాన రహదారి వెంట కొలువైఉన్న శ్రీఅంకమ్మ, మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు ఈ వివరాలు తెలిపారు. 30న శనివారం మధ్యాహ్నం 12.18కు ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ అధ్యక్షుడు కొమ్ము భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శి సూరంశెట్టి నర్సింహారావు, కోశాధికారి గుండోజు రామాచారి, 4వ డివిజన్ కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



దంపతులను ఆశీర్వదిస్తున్న రాందాస్‌నాయక్

వైరా, మార్చి27: స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ బుధవారం వైరాలో జరిగిన పలు శుభకార్యక్రమాల్లో పాల్గొన్నారు. కమ్మవారి కల్యాణ మండపంలో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. 9, పలు వార్డుల్లో జరిగిన నిత్యయతాంబులాల వేడుకల్లో పాల్గొని కాబోయే నూతన వధువరులను ఆశీర్వదించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, మిట్టపల్లి నాగి, పమ్మి అశోక్, పఠాన్ జాన్, సూర్యదేవర శ్రీధర్ పాల్గొన్నారు.

ఏన్కూరు: రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందిన కేసుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీనాయకుడు శెట్టిపల్లి సురేష్ దశదిన కార్యక్రమానికి బుధవారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ హాజరై మృతుని చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈకార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు మాజీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్ర రాజశేఖర్, సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, లేళ్ల వెంకటరెడ్డి, డాక్టర్ శెట్టిపల్లి నాగేశ్వరరావు, స్వర్ణ నరేంద్రకుమార్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, లాలూనాయక్, మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, బానోతు సురేష్ నాయక్, ముక్తి లక్ష్మినారాయణ, నన్నెఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విజయ కళాశాలలో ఆవిష్కార్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉషాకిరణ్

కొణిజర్ల, మార్చి27: మండల పరిధిలోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ఏప్రిల్3,4తేదీల్లో జరిగే ఆవిష్కార్ - 2024 కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్ , వైస్‌చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి, డైరెక్టర్ లీడర్స్ ఫర్ ఇండియా ఆర్గనైజేషన్ సీఈవో మౌనీష్ యర్రా శ్రీకవిత ఆవిష్కరించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఏప్రిల్‌లో జరిగే ఆవిష్కార్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. టెక్నికల్ ఈవెంట్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమాలతో పోటీతత్వాన్ని పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాన్‌బాబు, ప్రోగ్రాం కన్వీనర్ చిన్నయ్య, కోకన్వీనర్లు ఆయేషాతరుణం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించాలి

- జడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్

బోనకల్, మార్చి 27: నీటి ఎద్దడికి దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం అందించాలని జడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ డిమాండ్ చేశారు. మండలంలోని ఆళ్లపాడు, బోనకల్ గ్రామాలలో బుధవారం ఆయన ఎండిపోయిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసిన మొక్కజొన్న చివర దశలో నీటి ఎద్దడి వలన పూర్తిగా పంట నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది దెబ్బతిన్న పంటలను సీఎం కేసీఆర్ స్వయంగా బోనకల్ మండలానికి వచ్చి పరిశీలించారని గుర్తు చేశారు. సాగర్ జలాలలో రెండు తడులను అందిస్తే రైతుల పంటలు ఇంతగా నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చేది కాదన్నారు. రైతుల సమస్యలను పట్టించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులు బాధల్లో ఉంటే పట్టించుకునే ప్రజాప్రతినిధులే కరువయ్యారని వాపోయారు. నీటి ఎద్దడి వలన నష్టపోయిన పంటలను సర్వేచేయించాలని, రైతుల సమస్యలను పరిష్కరించడంలో దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బంధం శ్రీనివాసరావు, జంగా రవి, వేమూరి ప్రసాద్, గుండపనేని సుదాకర్‌రావు, మోదుగుల నాగేశ్వరావు, బాణోతు కొండ, పారా ప్రసాద్, గద్దల వెంకటేశ్వర్లు, మోర్ల నర్సింహరావు పాల్గొన్నారు.

పారిశుధ్యం పట్టని మునిసిపాలిటీ?

- చెత్తడంపింగ్‌కు కేరాఫ్‌గా సత్తుపల్లి శివారు
- నిర్మానుష్య రోడ్లలో విచ్చలవిడిగా వ్యర్థాలు



ఫైఓవర్ సమీపంలో వాటర్ ట్యాంక్ వద్ద చెత్తాచెదారం

సత్తుపల్లిరూరల్, మార్చి27: ఒకప్పుడు శుభ్రతకు నిలయంగా సత్తుపల్లి మునిసిపాలిటీ అని చెప్పుకునే స్థాయి నుంచి నేడు మురికికూపంగా మార్చే దిశగా అధికార యంత్రాంగం వ్యవహరిస్తుందనే ఆరోపణలు పట్టణ ప్రజల నుంచి వినిపిస్తుంది. పట్టణంలోని 23వ వార్డులను మునిసిపాలిటీకి చెందిన ట్రాక్టర్లు, ఆటోలలో సేకరిస్తున్నప్పటికీ కొందరు వ్యాపారస్థులు, గృహ వినియోగదారులు వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని పట్టణ శివారుల్లో యథేచ్ఛగా పడవేస్తున్నారు. ఇదేమని ప్రశ్నించే వారు లేకపోవడంతో ప్రజలు, వాహనదారులు ముక్కుమూసుకుని ప్రయాణాలు చేస్తున్నారు. అయితే పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు చెత్తను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లినా ఆ తర్వాత రాత్రివేళల్లో ఎవరి ఇష్టానుసారం శివారు ప్రాంతాలలో చెత్తను డంపింగ్ చేస్తున్నారని, ఈ చర్యలను అరికట్టాలంటే గస్తీ ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని నిర్మానుష్య ప్రదేశాలు, ఖాళీ స్థలాల్లో చుట్టుపక్కల వారు చెత్తను వేయడంతో డ్రైనేజీలలో కూరుకుపోయి మురుగు పారకుండా దోమలు, ఈగలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇదే విషయమై మునిసిపల్ కమీషనర్ మందా రవిబాబును వివరణ కోరగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పారిశుధ్య మహిళా కార్మికులకు చీరల పంపిణీ



ఖమ్మంరూరల్, మార్చి27: మండల పరిధిలోని ఏదాలాపురం పంచాయతీలో పనిచేస్తున్న పరిశుధ్య కార్మికులకు మానవ హక్కుల పరిరక్షణ ప్రజాసమితి ఆధ్వర్యంలో సాయిగణేష్ నగర్‌లోని సంఘం కార్యాలయంలో చీరలను పంపిణీ చేశారు. జిల్లా అధ్యక్షురాలు తోటకూర అంజమ్మ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మానవతా దృక్పథంతో పేద వారికి సహాయం చేయడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయిగణేష్ నగర్ కాలనీ అధ్యక్షుడు పోట్ల శ్రీనివాస్‌రావు, నాయకులు జగదీష్, హైమావతి, ప్రసాద్, రమేష్, శ్రీనివాస్, మాధవి, ఐలయ్య, పుల్లారావు, జోగారావు, వీరయ్య, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి చెక్‌డ్యామ్‌లు కూల్చివేయటంపై చర్యలు తీసుకోవాలి

రఘునాథపాలెం, మార్చి27: రైతులు సాగునీటి కష్టాలు తీర్చే చెక్‌డ్యామ్‌ను కొంతమంది కావాలని కూల్చివేశారని నిందితులపై చర్యలు తీసుకోవాలని రైతులు తహసీల్దారు వినతిపత్రం అందించారు. రఘునాథపాలెం మండలం మంచుకొండలోని సర్వే నెంబర్ 338లో సాగునీటి అవసరాల కోసం గతంలోనే చెక్‌డ్యామ్ నిర్మాణం జరిగింది. ఇటీవల కొంతమంది చెక్‌డ్యామ్‌ను ధ్వంసం చేశారు. దీంతో మంచుకొండకు చెందిన బాధిత రైతులు బుధవారం తహసీల్దార్ లూథర్ విల్సన్‌ను కలిసి సమస్యను వివరించారు.

గొర్రెపోతులతో ప్రభబండి



నేలకొండపల్లి,మార్చి27: మండల పరిధిలోని చెర్వుమాధారంలో జరుగుతున్న అంకమ్మ తిరునాళ్లకు బుద్దారం గ్రామానికి చెందిన మిండెం నాగరాజు మంగళవారం రాత్రి తన గొర్రెపోతులతో ప్రభ బండి కట్టుకుని కుటుంబ సభ్యులతో వెళ్లాడు. దీన్ని ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. తిరునాళ్లలో సైతం గొర్రెపోతుల ప్రభబండి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గతంలో అంకమ్మ గుడిని నిర్మించిన కనమర్ల పూడి సైదులు(దేవుడు సైదులు) ఆధ్వర్యంలో అంకమ్మ జాతర వైభవంగా నిర్వహించేవారు. సైదులు మరణానంతరం ఆయన వారసులు జాతరను నిర్వహిస్తున్నారు.

ఉపాధి కూలీలకు బీమా కల్పించాలి

సత్తుపల్లిరూరల్, మార్చి27: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు రేపాకుల శివలింగం, తిమ్మిడి హనుమంతరావు కేంద్రాన్ని కోరారు. బుధవారం సత్తుపల్లిలో కల్లూరు డివిజన్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గంటా శ్రీనివాసరావు, బీరెల్లి లాజర్, మంగన్న, కుర్సా వెంకటేష్, బయటి సురేష్, కుంటా కృష్ణ పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు వైద్యశిబిరం

చింతకాని, మార్చి 27: మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలోని భవిత కేంద్రంలో మానసిక దివ్యాంగ బాలబాలికలకు బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపి వైద్యురాలు జీ వసంత, భవితా కేంద్రం నిర్వాహకులు కేఎస్ కృష్ణారావు, భూక్య దశిలీ పాల్గొన్నారు.

పూడిక మట్టికి అనుమతివ్వండి

వైరా, మార్చి 27: వైరా రిజర్వాయర్‌లోని పూడిక మట్టిని సాగుభూముల్లోకి తోలుకోవడానికి వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో బుధవారం ఒక వినతిపత్రం సమర్పించారు. ఎకరాకు వంద ట్రక్కుల పూడిక మట్టి తోలుకొనేందుకు అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో మాదిరిగా మిషన్ కాకతీయ వలె మట్టి తొవ్వి పోసే ఎక్స్‌కవేటర్ ఖర్చులను ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. అలాగే చెరువులు, కుంటలున్న చోట కూడా పూడిక మట్టిని పొలాలకు తోలుకొనేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, నాయకులు చింతనిప్పు చలపతిరావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, చిత్తారు మురళీ, వడ్లమూడి మధు, కృష్ణయ్య పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

తల్లాడలో ఎమ్మెల్యే పర్యటన

తల్లాడ, మార్చి 27: మండలంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి బుధవారం పర్యటించారు. కుర్నవల్లి గ్రామంలోని ప్రతిష్ఠా మహోత్సవం, ఏరువెంకటాపురం గ్రామంలో జరుగుతున్న దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవ అష్టలక్ష్మీ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. గొల్లగూడెం, బస్వాపురం గ్రామాల్లో వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. కలకొడిమ గ్రామంలో సీపీఎం సీనియర్ నాయకుడు తాతా భాస్కర్‌రావును పరామర్శించారు. లక్ష్మీపురం గ్రామంలో ఇటీవల మృతిచెందిన బొగ్గుల జితేందర్‌రెడ్డి పెద్దకర్మకు హాజరై కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఒక్కో ఉపాధి కుటుంబానికి రూ.12వేలు ఇవ్వాలి

సత్తుపల్లిరూరల్, మార్చి27: ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు రూ.12వేలు ఒక్కో కుటుంబానికి వెంటనే ఇవ్వాలని టీకేఎంవో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ కోరారు. బుధవారం మండలంలోని రామానగరంలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. అనంతరం మండల కమిటీ నూతన అధ్యక్షుడిగా దండు అప్పారావును ఏకగ్రీవంగా ఎన్నుకోగా కార్యక్రమంలో వెంకట రామయ్య, సత్యనారాయణ, కాంతయ్య, శ్రీనివాసరావు, వజ్రమ్మ, సంపూర్ణ, బుచ్చమ్మ, పుల్లయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర నాయకులు బండెల వెంకయ్య కోరారు. బుధవారం మండలంలోని పిండిప్రోలులో ఆసంఘం డివిజన్‌సమావేశం ఎస్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది.

సాయిగణేష్ కుటుంబానికి బీజేపీ అభ్యర్థి తాండ్ర పరామర్శ



సాయిగణేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న వినోదరావు

ఖమ్మంబైపాస్‌రోడ్, మార్చి27: గతంలో ఆత్మహత్యకు పాల్పడిన బీజేపీ కార్యకర్త సామినేని సాయిగణేష్ కుటుంబాన్ని బీజేపీ లోక్‌సభ ఖమ్మం అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు బుధవారం పరామర్శించారు. బీజేపీ నాయకులతో కలిసి ఆయన జూబ్లీపురలోని సాయిగణేష్ ఇంటికి వెళ్లి వారి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాకుడంటామని, ప్రతీ కార్యకర్త మోదీ, అమిత్‌షా, కిషన్‌రెడ్డితో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ జిల్లా ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి, 7వ డివిజన్ కార్పొరేటర్ డి.సత్యనారాయణ, నంబూరి రామలింగేశ్వరరావు, కార్పొరేటర్ సత్యనారాయణ, దుద్దుకూరి వెంకటేశ్వరరావు, అల్లిక అంజయ్య, ఉపేందర్, భద్రం, శ్యామ్‌రాథోడ్, చావా కిరణ్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకులను కలిసిన తాండ్ర వినోదరావు

లోక్‌సభ ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు టీడీపీ నాయకులను బుధవారం సాయంత్రం కలిశారు. జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు నగరంలోని టీడీపీ కార్యాలయానికి వెళ్లి ఆపార్టీ నాయకులను కలిశారు. ఈసందర్భంగా టీడీపీ జిల్లా కార్యదర్శి కేతినేని హరీష్ బీజేపీ నాయకులకు స్వాగతం పలికారు. ఎన్డీఏ కూటమి భాగస్వాములైన రెండు పార్టీల కార్యకర్తలు నాయకులు కలిసికట్టుగా పనిచేసి ఖమ్మంలో జయకేతనం ఎగురవేయాలని వినోదరావు తెలపారు. అనంతరం నగరంలోని శ్రీరామహిల్స్‌లో నివాసం ఉంటున్న టీడీపీ సీనియర్ నాయకుడు పారుపల్లి సురేష్‌ను కూడా వినోదరావు కలిశారు.

బీజేపీలో బీఆర్ఎస్ నాయకుల చేరిక

రూరల్ మండలంలోని తెల్దారుపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు నున్నా రవికుమార్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఖమ్మం నగరంలోని ఓ హోటల్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు బీజేపీ కండువాలు కప్పి తాండ్ర వినోదరావు ఆహ్వానించారు.